# నమస్తే తెలంగాణ

జోగులాంబ **గద్వాల వనపర్తి**

5 | మహబూబ్‌నగర్, ఆదివారం 14 జూలై 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY


**కల్వకుర్తి ఎత్తిపోతల కాల్వలు బోసిపోయాయి.**

పదేండ్ల కాలంలో నిండుగా నీటితో ప్రవహించి ఆయకట్టును పచ్చగా మార్చగా.. నేడు నిర్వహణ కరువై గడ్డి, పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. నీళ్లు లేని కాల్వలను, అడుగంటిన రిజర్వాయర్లను చూసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. కాల్వల పరిధిలో పంటలు ఎలా పండించాలి అని మదనపడుతున్నారు. దీనికితోడు ఈసారి వర్షాభావ పరిస్థితులతో పంటల సాగు లక్ష్యానికి ఆమడ దూరంలో నిలిచే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వేసవిలో కాల్వల్లో పూడికతీత, పిచ్చి మొక్కలు తొలగించాల్సిన అధికారులు వాటిని మరిచారు. మంత్రి జూపల్లి స్వయంగా కాల్వలను పరిశీలించి నివేదిక అందించాలని ఆదేశించే వరకు ప్రాజెక్టు పనులను పట్టించుకోలేదని కర్షకులు ఆరోపిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో వానకాలం సాగు అంచనా 5.73 లక్షల ఎకరాలు ఉండగా.. ఇప్పటి వరకు కేవలం 1,73,307 ఎకరాల్లో మాత్రమే పంటలు సాగయ్యాయి. దీంతో సాగు ప్రశ్నార్థకంగా మారగా.. రైతులు ఆందోళన చెందుతున్నారు.


*– నాగర్‌కర్నూల్, జూలై 13 (నమస్తే తెలంగాణ)*



వనపట్ల శివారులో కాల్వ పరిస్థితి

# నాడు గలగల నేడు వెలవెల

కల్వకుర్తి ఎత్తిపోతల నాగర్‌కర్నూల్ జిల్లా వరప్రదాయిని. జిల్లాతో పాటుగా వనపర్తి, జడ్చర్ల ప్రాంతాల్లో దాదాపుగా 3 లక్షల ఎకరాలకుపైగా ఆయకట్టుకు సాగునీరు అందించే బృహత్తర పథకం.



వనపట్ల శివారులో పిచ్చిమొక్కలతో నిండిన కాల్వ

తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షతో తొలిసీఎం కేసీఆర్ వల్ల సాకారమైన ఈ లిఫ్ట్ గత ఏడెనిమిదేండ్లు పల్లెల్లో పంటల సిరులను అందించింది. అలాంటి ఈ ప్రాజెక్టు ఇప్పుడు బోసిపోయింది. వర్షాలు కురవకపోవడం.. కర్ణాటక నుంచి కృష్ణమ్మకు వరద జలాలు రాకపోవడంతో ఎంజీకేఎల్‌ఐ పథకంలోని జొన్నలబొగుడ, గుడిపల్లి, ఎల్లూరు జలాశయాల్లో నీటి మట్టాలు అట్టడుగు స్థాయిలో ఉన్నాయి. గతేడాది ఈ సమయంలో నిండుగా నీళ్లతో ఉండగా, కాల్వల్లో నిరంతరం నీళ్లు ప్రవహించాయి. ఇలా ఏండ్ల తరబడిగా జిల్లా రైతాంగానికి సేద్యంలో ఢోకా లేకుండా చేసింది. కానీ ఈ సంవత్సరం నీళ్లు లేక బోసిపోయింది. గ్రామాలకు నీళ్లు తీసుకెళ్లే కాల్వలు సైతం వట్టిపోయాయి. కాల్వల్లో, గట్ల వెంబడి పిచ్చి మొక్కలు, గడ్డితో దర్శనమిస్తున్నాయి. సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు సైతం కాల్వలను ముందస్తుగా సిద్ధం చేయాల్సి ఉన్నా పట్టించుకున్న దాఖలాలే లేవు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు ఎన్నికల్లో మునిగిపోవడం.. అధికారులు నిర్లక్ష్యం వహించడంతో కాల్వల నిర్వహణ చేపట్టలేదు. వారం కిందట ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రాజెక్టును పరిశీలించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అప్పటి వరకూ అధికారులు ప్రాజెక్టు పనులను పట్టించుకున్న పాపాన పోలేదు. ఇందులో భాగంగా కాల్వల పూడికతీత, పిచ్చి మొక్కలు తొలగించేందుకు అంచనాలు రూపొందించాలని మంత్రి ఆదేశించారు. ఈ పనులన్నీ ఎండాకాలంలో చేపట్టాల్సి ఉన్నది. వానకాలం రాకముందే చర్యలు తీసుకోవాల్సి ఉండగా మంత్రి ఆదేశంతోనే అధికారుల్లో కదలిక రావడంపై రైతుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే భారీ వర్షాలు కురవాల్సి ఉన్నా ఆలస్యం కావడంతో కాల్వలు ఖాళీగా ఉన్నాయి. లేకుంటే నిండుగా నీళ్లతో దర్శనమిచ్చేవి. అధికారులు నివేదికలు అందించి, ప్రభుత్వం నిధులు మంజూరు చేయించి పనులు ఎప్పటిలోగా చేపడతారో ప్రశ్నార్థకమే.

**1.73 లక్షల ఎకరాల్లోనే..**

జిల్లాలో వ్యవసాయ సాగుబడిపైనా ప్రభావం పడుతోంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో వానకాలం సాగు అంచనా 5.73 లక్షల ఎకరాలు ఉండగా ఇప్పటి వరకు కేవలం 1,73,307 ఎకరాల్లో మాత్రమే పం టలు సాగయ్యాయి. ఇందులో ఒక్క పత్తి పంటనే అత్యధికంగా 1,52,98 ఎకరాల్లో వేశారు. భారీ వర్షాలు కురవకపోవడంతో కల్వకుర్తి లిఫ్ట్‌కు కాల్వలు నీళ్లు లేక బోసిపోయాయి. తద్వారా సాగుపై పడిన ప్రభావం దిగుబడిపైనా పడనున్నది. కాగా ఈ అంశంపై స్పందించేందుకు సంబంధిత ఇరిగేషన్ అధికారులు సైతం అందుబాటులో ఉండటం లేదు. జిల్లా కేంద్రంలో కార్యాలయం ఉన్నా సీఈ, ఈఈ వంటి అధికారులు ఉండరు. ఫోన్లు చేసినా స్విచ్ఛాఫ్‌లో ఉండటం, లేకుంటే లిఫ్ట్ చేయకపోవడం పరిపాటిగా మారింది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి కాల్వల నిర్వహణ చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

- ఎంజీకేఎల్‌ఐ పర్యవేక్షణ గాలికి..
- నిర్వహణ మరిచిన ఇరిగేషన్ శాఖ
- వానకాలం వచ్చినా చేపట్టని పనులు
- గడ్డిమొక్కలతో నిండిన కాల్వలు
- సాఫీగా నీళ్లు పారడం కష్టమే..
- ఇంకా ప్రారంభంకాని నీటి విడుదల
- ప్రశ్నార్థకంగా సాగు
- ఆందోళనలో రైతులు

**జమ్ము తొలగించాలి**



బ్రాంచ్ కెనాల్‌ను జమ్ముగడ్డి ముంచెత్తింది. సాగునీళ్లు పారే పరిస్థితి కనిపించడం లేదు. వానకాలం ప్రారంభమైనా తొలగించడం లేదు. కాల్వలకు ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తే చివరి ఆయకట్టు పొలాల రైతులకు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. వెంటనే అధికారులు చర్యలు చేపట్టాలి. అప్పుడే అందరి పొలాలకు నీళ్లు పారుతాయి. బ్రాంచ్ కెనాల్ నుంచి పిల్ల కాల్వలు లేకపోవడంతో సాగునీరు పూర్తిస్థాయిలో అందడం లేదు.

**- కాకం లక్ష్మయ్య, రైతు, కోడేరు, నాగర్‌కర్నూల్ జిల్లా**

**అధికారులు పట్టించుకోలే..**



బ్రాంచ్ కాల్వను అధికారులు పట్టించుకోవడం లేదు. కంప చెట్లు, జమ్ముగడ్డి కమ్ముకున్నది. ఇరిగేషన్ శాఖ నిర్వహణను గాలికొదిలేసింది. కోతలకు గురైనా మరమ్మతులు చేయడం లేదు. కాల్వలు సక్రమంగా లేక.. నిర్వహణ కరువై చివరి ఆయకట్టుకు నీళ్లు అందడం లేదు. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారులు వెంటనే జమ్మును తొలగించి సాగునీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. కర్షకులను ఇబ్బందులకు గురిచేయొద్దు.

**- వెంకటస్వామి, రైతు, కోడేరు, నాగర్‌కర్నూల్ జిల్లా**



హైదరాబాద్‌లో గద్వాల బీఆర్‌ఎస్ నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్

# అండగా ఉన్నోళ్లను మరువం

- అలాంటి నేతలకే ప్రాధాన్యం
- బీఆర్‌ఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారక రామారావు
- 22న గద్వాలకు కేటీఆర్
- బీఆర్‌ఎస్ నేత బాసు హనుమంత్

గట్టు, జూలై 13 : కష్టకాలంలో ఉన్న సమయంలో పార్టీకి అండగా ఉన్నోళ్లను బీఆర్‌ఎస్ ఎప్పటికీ మరువబోదని, వెన్నంటే ఉన్న వారికే మొదటి ప్రాధాన్యం ఉంటుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో కేటీఆర్ గట్టు మండలం సర్పంచ్ సంఘాల మాజీ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ జిల్లా నేత బాసు హనుమంతు నాయుడుతోపాటు జిల్లా నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుత గద్వాల నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అనంతరం 'నమస్తే తెలంగాణ'తో ఫోన్‌లో హనుమంతు మాట్లాడుతూ రాబో యే రోజుల్లో నియోజకవర్గ పార్టీ పగ్గాలు బీసీలకే అప్పగించనున్నట్లు కేటీఆర్ సూచనప్రాయంగా చెప్పారని వివరించారు. ఈనెల 22వ తేదీ (సోమవారం)కేటీఆర్ గద్వాల పర్యటనకు వస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో శాట్ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు ఇంతియాజ్, కుర్వ విజయ్‌కుమార్, మోనేశ్, తిరుమల్, నూర్‌పాషా, బాసు గోపాల్, ఎల్లందొడ్డి రాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# జూరాల ఆయకట్టుకు నీళ్లు


పెబ్బేరు, జూలై 13 : ఎట్టకేలకు జూరాల ఆయకట్టుకు అధికారులు సాగునీటిని శనివారం విడుదల చేశారు. పెబ్బేరు మండల పరిధిలోని ప్రధాన ఎడమ కాల్వలో నీళ్లు నిండుగా ప్రవహిస్తూ ముందుకు సాగుతోంది. నారుమళ్లు సిద్ధం చేసుకునేందుకు రైతుల విజ్ఞప్తి మేరకు అధికారులు సాగునీటిని విడుదల చేశారు. కాగా, నీటిని డిస్ట్రిబ్యూటరీలకు ఇంకా వదలకుండా ప్రధాన ఎడమ కాల్వకే పరిమితం చేశారు. పూర్తిస్థాయి ఆయకట్టుకు నీటిని విడుదల చేసేందుకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉన్నది. కాగా పెబ్బేరు మండలంలో దాదాపు 20 గ్రామాలకు సాగునీరు అందనున్నది. ప్రాజెక్టులకు వరద వానకాలం చివరి వరకు కొనసాగితే మరింత పెరిగే అవకాశం ఉన్నది. ఇప్పటికే వరి సాగు కోసం రైతులు కరిగెట్ల సిద్ధం చేసి నారుమడులు వేశారు.

పెబ్బేరు వద్ద నిండుగా పారుతున్న జూరాల ప్రధాన ఎడమ కాల్వ

# కమనీయం వేంకటేశుడి కల్యాణం

- నాగర్‌కర్నూల్‌లో గోవింద నామస్మరణతో మార్మోగిన యాగమండపం
- 75 మంది దంపతులతో హోమాలు

నాగర్‌కర్నూల్, జూలై 13 : కలియుగ ప్రత్యక్ష దైవమైన వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం శనివారం భక్తుల గోవిందనామస్మరణ మధ్య కమనీయంగా జరిగింది. నాగర్‌కర్నూల్‌లోని ఓంనగర్ కాలనీలో 83వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవంలో భాగంగా శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ వేదమంత్రోచ్ఛరణల మధ్య వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు సామూహికంగా నవగ్రహ హోమాలు, వేద బ్రాహ్మణులతో శాస్త్రోక్తంగా చేపట్టారు. 75 మంది పరమ శివుడిని ప్రసన్నం చేసుకునేందుకు సుదర్శన హోమం కాశీ నుంచి బయలుదేరి శ్రీశైలం వెళ్తున్న లింగ అఘోరాలు శ్రీకాళ చక్ర యాగశాలలో ప్రత్యేక పూజలను దర్శించి, భక్తులను ఆశీర్వదించారు. ఐశ్వర్యం, విజ్ఞానం, బుద్ధి శౌర్యం, ప్రసన్నత, కార్యసిద్ధి కోసం ఈ హో మాలు సహకరిస్తాయని స్వరూపానంద స్వామీ చెప్పారు. ఆదివారం సూర్య సరస్వతీ హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. చిన్నారులు పుస్తకాలు, పెన్నులు, బలపాలు, పలకలు వెంట తెచ్చుకోవాలని సూచించారు.



వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు



విద్యుత్ తీగలు, కారుపై పడిన వేప చెట్టు

## ఈదురు గాలుల బీభత్సం

- నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- మూడు గంటలపాటు కరెంట్ కట్

అయిజ, జూలై 13 : అయిజ పట్టణంలో ఈదురు గాలులకు చెట్లు కూలి విద్యుత్ తీగలు, కారుపై పడడంతో ఓ విద్యుత్ స్తంభం నేల కూలింది. దీంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో ఒక్కసారిగా ఈదురు గాలులు వీచాయి. గాలులకు వేప చెట్టు విరిగి విద్యుత్ తీగలు, ఇంటి సమీపంలో నిలిపిన కారుపై పడింది. ఒక్కసారిగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అటు వైపు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేసిన అధికారులు యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. కూలిన చెట్ల కొమ్మలను తొలగించి, విద్యుత్ స్తం భం ఏర్పాటు చేసి వి ద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. ఏఈ ఆదేశాల మేరకు లైన్ ఇన్‌స్పెక్టర్ సర్వోత్తమ్, సిబ్బంది, కాంట్రాక్టర్ సహకారంతో తీగలు, లైన్లు సరిచేశారు. రా త్రి 9 గంటల ప్రాంతంలో విద్యుత్ సరఫరాను సిబ్బంది పునరుద్ధరించారు.



విద్యుత్ పునరుద్ధరణ పనులు చేస్తున్న సిబ్బంది

# కమ్మేసిన పొదలు

- గుడిపల్లి రిజర్వాయర్ బండ్‌పై ముళ్ల కంప

నాగర్‌కర్నూల్, జూలై 13 : ఎంజీకేఎల్‌ఐ పథకంలోని లిఫ్ట్–3లో ఉన్న గుడిపల్లి రిజర్వాయర్ బండ్‌పై ముళ్ల పొదలు కమ్మేశాయి. కట్టపై రెండువైపులా పొదలు వ్యాపించడంతో సందర్శకులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నడిచి వెళ్లేందుకు కూడా వీలులేకుండా రహదారిపై వాలాయి. చెట్లతో కట్ట ప్రమాదంలో పడే అవకాశాలు ఉన్నాయని స్థానికులు రైతులు, ప్రజలు అంటున్నారు. ప్రస్తుతం జొన్నలబొగుడ రిజర్వాయర్ నుంచి గుడిపల్లికి నీరు చేరడంతో రెండు మోటర్ల ద్వారా రిజర్వాయర్‌లోకి నీటిని వదులుతున్నారు. ఈ తరుణంలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలిరానున్నారు. వారు రిజర్వాయర్ అందాలను తిలకించేందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. అలాగే బండ్‌పై రోడ్డు గుంతలతో అధ్వానంగా తయారైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముళ్ళ చెట్లను తొలగించి రోడ్డును బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.



గుడిపల్లి రిజర్వాయర్ బండ్‌పై ప్రమాదకరంగా ముళ్లకంప

# కొత్త చట్టాలపై అవగాహన కల్పించాలి

- హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మీనారాయణ



కోర్టు గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయవాది లక్ష్మీనారాయణ

వనపర్తి టౌన్, జూలై 13 : నూతన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మీనారాయణ న్యాయవాదులకు సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో న్యాయవాదుల గ్రంథాలయం, సాక్షుల గదులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో నూతన సమీకృత భవన నిర్మాణం, పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటునకు కృషి చేస్తానన్నారు. కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌ను వినియోగించుకునేలా చూడాలన్నారు. అదేవిధంగా బార్ అసోసియేషన్ చాంబర్‌లో న్యాయవాదులతో ఆయన మాట్లాడారు. అనంతరం జిల్లా న్యాయ సమీక్ష సమావేశానికి హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తులు సునీత, రజిని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌యాదవ్, కార్యదర్శి బాల్‌నాగయ్య, సీనియర్ న్యాయవాదులు నాగేశ్వర్, పురుషోత్తం, భరత్‌కుమార్, మోహన్‌గౌడ్, నిరంజన్‌బాషా, రాంచంద్రారెడ్డి, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

***రంగనాథ ఆలయంలో పూజలు..***

పెబ్బేరు, జూలై 13 : శ్రీరంగాపురంలోని శ్రీ రంగనాథస్వామి ఆలయాన్ని శనివారం హైకోర్టు జడ్జి లక్ష్మీనారాయణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

# అభిప్రాయ సేకరణలో రైతులేరీ?

- కాంగ్రెస్ కార్యకర్తలనే సమావేశంలో కూర్చోబెడుతున్నరు
- పెట్టుబడి సాయం అందించలేకే కాలయాపన
- కేసీఆర్ సర్కారులోనే రాష్ట్రం సుభిక్షం
- బీఆర్‌ఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్



వనపర్తిలో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, చిత్రంలో పార్టీ నాయకులు

వనపర్తి, జూలై 13 : రైతుల అభిప్రాయ సేకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేయడం తప్పా అన్నదాతలకు ఒరగబెట్టిందేమీ లేదని బీఆర్‌ఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ విమర్శించారు. శనివారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నివాసంలో గురువారం బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణాధ్యక్షుడు రమేశ్‌గౌడ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు సకాలంలో పెట్టుబడి సాయం అందించడం చేతగాకనే అభిప్రాయాలంటూ మోసం చేస్తున్నదని మండిపడ్డారు. కౌలు రైతులకు ఇచ్చిన హామీలను ఎలా నెరవేరుస్తారో తెలుపాలన్నారు. అభిప్రాయ సేకరణ పూర్తిగా మోసపూరితమైందన్నారు. రాష్ట్రంలో 71లక్షల రైతు కుటుంబాలుండగా, కేసీఆర్ సర్కారు 69లక్షల రైతు కుటుంబాలకు రైతుబంధు ఇచ్చిందన్నారు. కేవలం 8శాతం ఉన్న భూస్వాముల కోసం 92శాతం ఉన్న రైతాంగానికి రైతు భరోసా నిలిపివేయడం సరికాదన్నారు. పదేండ్లలో రుణమాఫీ చేయలేదని కాంగ్రెస్ మంత్రులు ఆరోపణలు చేస్తున్నారని, రెండు విడుతల్లో రూ.56లక్షలకు పైగా రైతులకు రుణమాఫీ చేసినట్లు తెలిపారు. అలాగే రైతుబీమా ద్వారా లక్షా 10వేల మంది రైతు కుటుంబాలకు పరిహారం అందించామన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించిందని చెప్పారు. హస్తం పార్టీ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా చేసింది శూన్యమన్నారు. రైతుభరోసాపై కాంగ్రెస్ నాయకులకు గుర్తింపుకార్డులు ఇచ్చి అభిప్రాయ సేకరణ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. వారి కార్యకర్తలే రైతులయ్యారని, వాళ్ల అభిప్రాయాన్ని రైతుల అభిప్రాయంగా సబ్ కమిటీ స్వీకరించడం రైతులను మోసం చేయడమేనన్నారు. కలెక్టరేట్‌లో మీటింగ్ ఏర్పాటు చేసి కిలోమీటర్ దూరం నుంచే మూడంచెల భద్రత ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో మంత్రులు టూరిస్టుల మాదిరిగా తిరుగుతున్నారని మండిపడ్డారు. టైంపాస్ రాజకీయాలు మాని ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో కౌన్సిలర్లు నాగన్నయాదవ్, కంచె రవి, బీఆర్‌ఎస్ నాయకులు యుగంధర్‌రెడ్డి, మన్యం, రాము, వెంకటేశ్, శ్రీను, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# లొద్ది మల్లయ్య జాతర బంద్

- అటవీశాఖ అధికారి రోహిత్‌గోపిడి

అమ్రాబాద్, జూలై 13 : మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన లొద్ది మల్లయ్య దర్శనానికి భక్తులకు అనుమతి లేదని జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్‌గోపిడి శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 17న తొలి ఏకాదశిని పురస్కరించుకొని నిర్వహించే లొద్ది మల్లయ్య జాతరను ఎన్‌టీసీఏ ఆదేశాల మేరకు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అటవీ ప్రాంతంలో జంతువుల పునరుత్పత్తికి అనుకూల సమయం కావడంతో ప్రకృతికి సహకరించాలని కోరారు. పశువుల మేతకు, తేనె కోసం ఇతర అవసరాలకు అడవిలోకి ఎవరికీ అనుమతి లేదన్నారు.

అనుమతి లేకుండా ఎవరైనా ప్రవేశిస్తే వైల్డ్‌లైఫ్ చట్ట ప్రకారం శిక్ష విధిస్తామని, వాహనాలు వస్తే సీజ్ చేస్తామని తెలిపారు. ఈ విషయాన్ని గమనించి భక్తులు, ప్రజలు, యాత్రికులు అడవిలోకి రాకూడదని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# గోరింటాకు మహోత్సవం

కొత్తకోట, జూలై 13 : కొత్తకోటలోని 2వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గోరింటాకు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆషాఢమాసం సందర్భంగా ఆడపడుచులు గోరింటాకు పెట్టుకుంటే మహాలక్ష్మి ఇంటికి వస్తుందని భావిస్తారు. గోరింటాకు పెట్టుకొని ఎర్రగా పండడంతో ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. కార్యక్రమంలో వనజ, కళావతి, అన్నపూర్ణ, సావిత్రి, తస్లిమా, రేవతి, ప్రేమలత, వీణమ్మ, ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



గోరింటాకు చూపిస్తున్న మహిళలు